క్లుప్తంగా

రాజన్నా శరణు.. శరణు



వేములవాడ: రాజన్నను శనివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రద్దీ పెరగడంతో అభిషేకాల టికెట్లను కుదించారు. వీఐపీల తాకిడి పెరిగి సామన్యులు ఇబ్బందులు పడ్డారు.

మిడ్‌మానేరులో 23 టీఎంసీలు



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో నీటిమట్టం 23.44 టీఎంసీలకు చేరింది. ఇటీవల ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి కొద్ది రోజులు నీటిని విడుదల చేసి, రెండు రోజుల క్రితం నీటి విడుదల నిలిపివేశారు.

మండలంలో 144 సెక్షన్



ఎస్సై నవత

వీర్నపల్లి : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆదివారం మండలవ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై నవత తెలిపారు. గ్రామాల్లో గ్రూపులుగా ఉంటూ సమావేశాలు నిర్వహించవద్దన్నారు. నలుగురు వ్యక్తులు గుమిగూడరాదని, డీజే సౌండ్స్, పటాకులు నిషేధమన్నారు. మండలప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

'కేటీఆర్ గెలుపు ఖాయం'



మాట్లాడుతున్న అంతయ్య

తంగళ్లపల్లి: మంత్రి కేటీఆర్ మరోసారి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు కోడి అంతయ్య అన్నారు. శనివారం మండలకేంద్రలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నవీన్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న రాజేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): నిరుపేద కుటుంబానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడికి సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి శనివారం రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. వాలీబాల్‌లో ప్రతిభ చాటిన విద్య మనోహర్ స్పోర్ట్స్‌లో శిక్షణకు ఎంపికయ్యాడు. పేదరికంతో ఇబ్బందిపడుతుండగా సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు వేముల సత్యంగౌడ్ సూచన మేరకు రాజేందర్‌రెడ్డి ట్రాక్‌సూట్, షూస్, ఇతర అవసరాలకు ఆర్థికసాయం అందించాలని కోరారు. విద్యమనోహర్ ఇప్పటికే రాష్ట్రస్థాయి జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. రాజేందర్ రెడ్డికి సత్యంగౌడ్ ధన్యావాదాలు తెలిపారు.

నిలిచిన నిఘా వాహనాలు



వేములవాడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిలిపిన వాహనాలు

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. పక్షం రోజులుగా నిరంతరం నిఘాతో నియోజకవర్గమంతా చుట్టుముట్టి వచ్చిన నిఘా వాహనాలను వేములవాడ మండల పరిషత్ ఆవరణలో ఇలా నిలిపారు.

రేపు దివ్యాంగులకు క్రీడాపోటీలు

సిరిసిల్లటౌన్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సిరిసిల్లోని సత్యసాయి మందిరంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు జిల్లా దివ్యాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు క్యారం, చెస్, మెమొరీ పవర్, రింగ్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 98903 71361, 63023 37617 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇక పనిలో పడదాం..

- ముగిసిన అసెంబ్లీ ఎన్నికలు
- నెల రోజులుగా అభ్యర్థుల వెంట ప్రచారం
- వ్యాపారంలో కొందరు.. వ్యవసాయ పనుల్లో ఇంకొందరు బిజీ



పొలం దున్నుతున్న కనుకయ్య

బోయినపల్లి(చొప్పదండి): అసెంబ్లీ ఎన్నికల సమరం ముగిసింది. నెలరోజులుగా వివిధ రాజకీయ పార్టీల హోరాహోరీ ప్రచారంతో గ్రామాలన్నీ మార్మోగాయి. ఇప్పుడు గ్రామాల్లో పరిస్థితి యథావిధికి చేరుకుంది. ఎన్నికలు ముగియడంతో ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. మండలంలోని 23 గ్రామాల్లో 30,273 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 24,061 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రచారంలో పలు గ్రామాల్లోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ తదితర పార్టీలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందులో వ్యవసాయం, వ్యాపారంతోపాటు పలు వృత్తుల్లో ఉన్నవారు చాలామంది ఉన్నారు. వీరంతా ఎన్నికల సమయంలో తమ పనులు తాత్కాలికంగా పక్కనపెట్టి తాము మద్దతిస్తున్న అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. ఎన్నికలు ముగియడంతో హమ్మయ్యా అంటూ పనులు మొదలుపెట్టారు.

ఫెస్టిసైడ్స్ దుకాణం తెరిచాను



వ్యవసాయంతో పాటు పురుగు మందుల దుకాణం నడుపుతున్నా. కొద్ది రోజులుగా బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నా. ఎలక్షన్ బిజీలో దుకాణం సరిగా తీయలేదు. ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి. రెండ్రోజులుగా యథావిధిగా ఫెస్టిసైడ్స్ దుకాణం తెరిచాను.

– బోయిని రాజు, బోయినపల్లి

పొలం పనులు మొదలుపెట్టా



నేను కాంగ్రెస్ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా. నెలరోజులుగా అభ్యర్థికి మద్దతుగా మండలంలోని గ్రామాలతో పాటు పలు మండలాల్లో ఎన్నికల ప్రచారంలో తిరిగా. ఎన్నికలు ముగిశాయి. మళ్లీ ఎప్పటిలాగే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యా.

– ఏనుగుల కనుకయ్య, విలాసాగర్

యథావిధిగా కర్రకోత పని



మండలకేంద్రంలో మాకు సామిల్ ఉంది. కర్ర కోత పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నా. బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించా. ఎన్నికలు ముగియడంతో మళ్లీ ఎప్పటిలాగే సామిల్ మిషన్‌లో కర్ర కోత పనులు మొదలుపెట్టా.

– ఉదారి నర్సింహచారి, బోయినపల్లి



క్రీడా ప్రాంగణంలోనే కొనుగోలు కేంద్రం

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అనువైన స్థలాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు రోడ్ల వెంబడి, పొలాల్లో, అడవికి దగ్గరగా ఉన్న ఖాళీ స్థలాలో ధాన్యం పోస్తున్నారు. గర్జనపల్లిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి సీజన్‌లో దాదాపు నెలరోజుల పాటు కొనుగోళ్లు జరుగుతాయి. ప్రతిసారి ధాన్యం కొనుగోళ్ల సీజన్‌లో కోతులు, అడవి పందులు, దొంగల బెడదతో ఇబ్బందులకు గురవుతున్నామని, ఇప్పటికైనా అధికారులు ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రానికి 20 ఎకరాల స్థలం కేటాయించాలని మండల రైతులు కోరుతున్నారు.

5 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



రవీందర్‌రావుకు ఆహ్వానపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో శ్రీ మహంకాళి మహాలక్ష్మీ, భూలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను ఈనెల 5 నుంచి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో పాల్గొనాలని ఈ మేరకు టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు ఆలయ కమిటీ పెద్దలు శనివారం ఆహ్వానపత్రం అందించారు. 5న యాగశాల ప్రవేశం, గురుపూజ, గణపతిపూజ, అగ్ని ప్రతిష్ఠ, 6న చండీ హవనం, సామూహిక కుంకుమార్చనలు, 7న యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, అమ్మవారి శోభా యాత్ర నిర్వహించనున్నట్లు భక్తజన బృందం తెలిపింది.

ప్రమాదపుటంచున ప్రయాణం..



వీర్నపల్లి : మండల కేంద్రం నుంచి మద్దిమల్ల గ్రామానికి వెళ్లే రహదారి వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకిరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరుగకముందే అధికారులు రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సర్పంచ్‌కు పరామర్శ



నివాళి అర్పిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని సముద్ర లింగాపూర్ సర్పంచ్ మోతె రాజిరెడ్డి తండ్రి వెంకటరాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సర్పంచ్ కుటుంబాన్ని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం పరామర్శించారు. వెంకటరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు సిరిసిల్ల విద్యార్థి



సిద్ధార్థ్‌ను అభినందిస్తున్న నాగుల సంతోష్‌గౌడ్

సిరిసిల్లటౌన్: జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు సిరిసిల్లకు చెందిన విద్యార్థి సిద్ధార్థ్ ఎంపికయ్యారు. స్థానిక పత్తిపాక వీధిలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియంలో పదో తరగతి చదువుతున్న సిద్ధార్థ్ గత నెల 26న పెద్దపల్లిలో జరిగిన అండర్–17 విభాగంలో జిల్లాస్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. సిద్ధార్థ్‌ను కరస్పాండెంట్ నాగుల సత్యనారాయణగౌడ్, ప్రిన్సిపాల్ బిజ్జు, పీఈటీ మదన్ అభినందించారు.

అద్దె లేని వ్యాపారం

- రోడ్డుపైనే అమ్మకాలు
- ఆదర్శంగా నిలుస్తున్న చిరువ్యాపారి





హన్మాజీపేటలో రోడ్డుపై దుస్తుల అమ్మకాలు

వేములవాడ రూరల్: లక్షల రూపాయలతో గదులు అద్దెకు తీసుకుని దేవుని మీద భారంతో వ్యాపారం చేస్తున్న ఈ రోజుల్లో ఎలాంటి అద్దె లేకుండా రోజుకో గ్రామంలో వ్యాపారం చేస్తున్న ఓ చిరువ్యాపారి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన గాజుల లక్ష్మణ్ ఆటోలో కాటన్ వస్త్రాలు పెట్టుకొని గ్రామాల్లో తిరుగుతూ అమ్మకాలు జరుపుతున్నాడు. పదో తరగతి వరకు చదివిన ఆయన ప్రభుత్వం ఉద్యోగం, ఉపాధి లేకపోవడంతో వ్యాపారాన్ని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాడు.

సాహితీ కళోత్సవాలు విజయవంతం చేద్దాం

- శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాహితీప్రియులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రపంచ తెలుగు సాహిత్య కళోత్సవాలను విజయవంతం చేయాలని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్ కోరారు. ఎల్లారెడ్డిపేటలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఉత్సవాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈనెల 16, 17 తేదీల్లో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల నిరంతర కవితా పఠనం, కళల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాహితీవేత్తలు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కళాశాల డైరెక్టర్ ఏలూరి రాజయ్య, ప్రిన్సిపాల్ నాగేందర్‌రావు పాల్గొన్నారు.

ఐదేళ్లయినా నిర్మించలే !

- రోడ్డు విస్తరణలో బస్టాండ్ కూల్చివేత
- ఐదేళ్లు గడిచినా పత్తాలేని నిర్మాణం
- స్థల పరిశీలనకే గడుస్తున్న కాలం
- మండుటెండల్లో ప్రయాణికుల పాట్లు



బస్టాండ్ లేకపోవడంతో మండుటెండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న సీనియర్ సిటిజన్స్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలో బస్టాప్ లేకపోవడంతో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుదు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైనే నిల్చొని బస్సులు ఆపాలని డ్రైవర్లను రిక్వెస్ట్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నా ప్రజలకు కనీస వసతులు సమకూర్చడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందన్న విమర్శలున్నాయి. పబ్లిక్ టాయిలెట్స్, బస్టాప్, కూరగాయల మార్కెట్, తంగళ్లపల్లి వాసులకు అందుబాటులో లేవు.

రోడ్డు విస్తరణలో కూల్చేశారు

మండలకేంద్రంలో సింగిల్ లైన్‌గా ఉన్న తారు రోడ్డును ఐదేళ్ల క్రితం నాలుగు లేన్లుగా మార్చేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. అయితే అప్పటికే మండలకేంద్రంలో ఉన్న బస్టాండ్‌ను రోడ్డు విస్తరణలో పనుల్లో భాగంగా కూల్చివేశారు. అయితే కూల్చివేసి ఐదేళ్లు గడుస్తున్నా మరోచోట బస్టాప్‌ను ఏర్పాటు చేయలేదు. మార్కండేయ ఆలయ సమీపంలో గతంలో బస్టాప్ ఉండేది. అయితే కూల్చిన అనంతరం అక్కడ మిగిలిన భూమిని కొందరు కబ్జాచేసినట్టు ఆరోపణలున్నాయి.

ప్రయాణికులు ఇబ్బంది

మండలకేంద్రం నుంచి సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు మండుటెండలోనూ, వానకు తడుస్తూ రోడ్డుపై నిల్చొని బస్సుల కోసం ఎదురుచూడాల్సిందే. దానికితోడు మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ కూడా లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాప్ నిర్మాణంతో పాటు పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించాలని కోరుతున్నారు.

బస్టాప్ నిర్మించాలి



తంగళ్లపల్లి మండలకేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తోంది. ఇది వరకు ఉన్న బస్టాప్‌ను రోడ్డు విస్తరణలో కూల్చేశారు. కానీ ఇప్పటివరకు కొత్తది నిర్మించలేదు. బస్టాప్ నిర్మిస్తే ప్రయాణికులు ఇబ్బందులు తొలగుతాయి.

– మచ్చ యాదగిరి, తంగళ్లపల్లి

బస్సులు ఆపడం లేదు



మండలకేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో రోడ్డుపైనే బస్సు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. మండుటెండలోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్ లేకపోవడంతో డ్రైవర్లు బస్సులను ఇష్టం వచ్చిన చోట ఆపుతున్నారు.

– స్వర్గం రాజేశం, తంగళ్లపల్లి

నిధులు కేటాయిస్తే నిర్మిస్తాం



మండలకేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించేందుకు గ్రామ పంచాయతీ సిద్ధంగా ఉంది. కానీ నిధుల లేమి కారణంగా ఆచరణకు నోచుకోలేదు. జిల్లా అధికారులు ప్రత్యేక నిధులు, స్థలం కేటాయిస్తే బస్టాండ్ నిర్మిస్తాం.

– అంకారపు అనిత, సర్పంచ్, తంగళ్లపల్లి



చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలవాలని గణగాపూర్‌లో పూజలు

పూజలు.. అన్నదానాలు



ఆది శ్రీనివాస్ గెలవాలని అయ్యప్పస్వామి మహా పాదయాత్ర చేస్తున్న మాల ధారులకు తమిళనాడులో అన్నదానం

వేములవాడ: తమ నాయకుడే గెలవాలంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల కార్యకర్తలు, నాయకులు పూజలు, అన్నదానాలు చేస్తున్నారు. అయ్యప్ప మహాపాదయాత్ర చేస్తున్న వేములవాడకు చెందిన అయ్యప్ప భక్తులకు ఆది శ్రీనివాస్ అభిమాని యామ బాబు శనివారం తమిళనాడులో అన్నదానాలు చేశారు. చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలవాలంటూ గణగాపూర్‌లో పూజలు చేసి అన్నదానాలు చేశారు.